సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 21 । ఫిబ్రవరి । 2024



వేధిస్తే కాల్ చేయండి

ప్రేమ పేరిట అమ్మాయిలను వేధిస్తే కాల్ చేయాలని రాచకొండ డిప్యూటీ కమిషనర్ ఉషావిశ్వనాథ్ సూచించారు. 8లో▸



ఆక్రమిస్తే చర్యలు

ఆలయ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్ప వని దేవాలయ భూముల పరిరక్షణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత అన్నారు. 8లో▸



జిల్లా జట్టు జయకేతనం

అంతర్‌జిల్లా సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో జిల్లా బాలికల జట్టు విజయకేతనం ఎగురవేసింది. 8లో▸

న్యూస్‌రీల్

షాద్‌నగర్ ఎంవీఐగా వాసు బాధ్యతల స్వీకరణ



షాద్‌నగర్: షాద్‌నగర్ మోటార్ వెహికిల్ ఇన్ స్పెక్టర్‌గా వాసును నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన బాలు నాయక్ నాగర్‌కర్నూల్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హైదరాబాద్‌లో పని చేస్తున్న వాసు షాద్‌నగర్‌కు బదిలీపై వచ్చారు.

బంజార భవన్ ప్రహరీ కూల్చివేత

ఆందోళనకు దిగిన బంజారా నాయకులు



రహదారిపై ఆందోళన చేస్తున్న బంజారా సంఘం నాయకులు

మీర్‌పేట్: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించారని బాలాపూర్ మండల రెవెన్యూ అధికారులు మీర్‌పేట్ పరిధి సర్వేనంబర్ 119లో బంజార భవన్ ప్రహరీని మంగళవారం కూల్చివేశారు. విషయం తెలుసుకున్న స్థానిక బంజారా, గిరిజన సంఘం నాయకులు రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి 119 సర్వే నంబర్‌లో బంజారా భవన్‌కు స్థలం కేటాయించారని, చాలా రోజుల క్రితం ప్రహరీ నిర్మించడం జరిగిందని, దీంతో పాటు రెండ్రోజుల క్రితం శ్రీసంత్ సేవాలాల్ జయంతి నిర్వహించినట్లు చెప్పారు.బంజారా భవన్ ప్రహరీని అధికారులు తొలగించడం సరైంది కాదని అన్నారు. కూల్చిన చోటే ప్రభుత్వం భవన్‌ను నిర్మించాలని, లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.అనంతరం రహదారిపై ఆందోళన చేస్తున్న కార్పొరేటర్ ఇంద్రావత్ రవి నాయక్, కోఆప్షన్ సభ్యులు జటావత్ రవి నాయక్, శ్రీను నాయక్ తదితరులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

గ్యాస్ గోదాం తనిఖీ

ఇబ్రహీంపట్నం: పట్టణంలోని భారత్ గ్యాస్ గోదాం, పద్మావతి పెట్రోల్ బంకును మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రఘునందన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్యాస్ పంపిణీలో జాప్యం చేయొద్దని తెలిపారు. గ్యాస్ గిడ్డంగి సిలిండర్ల ప్రామాణికాలను పరిశీలించారు. పద్మావతి పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేసి ప్రామాణికాలను పాటించాలని సూచించారు. ఆయన వెంట ఆ శాఖ అధికారి అలీ ఉన్నారు.

ఏం కష్టమొచ్చిందో...?

మల్కాజిగిరి: అరవై ఏడేళ్ల వయసున్న వృద్ధురాలు...42 ఏళ్ల వయసున్న ఆమె కుమారుడు ఆత్మహత్య చేసుకున్నారు. మల్కాజిగిరి పటేల్‌నగర్‌లో మంగళవారం ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. ఈ వయసులో వారికి ఏం కష్టం వచ్చిందోనని స్థానికులు చర్చించుకోవడం కనిపించింది. మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ ఎస్.ఐ కృష్ణమల్ తెలిపిన వివరాల ప్రకారం..నిజామాబాద్‌కు చెందిన స్వరూప (67)కు కుమారుడు శ్రీకాంత్(42) ఉన్నాడు. ఇతడు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని సోదరుడు రవి నిజామాబాద్‌లో ఉంటున్నాడు. 15 ఏళ్ల క్రితం భర్తతో విభేదాలు రావడంతో స్వరూప విడిపోయి మల్కాజిగిరి పటేల్‌నగర్‌లో నివాసముంటున్నది. అలాగే శ్రీకాంత్‌కు వివాహం అయినప్పటికీ భార్యతో విభేదాలు రావడంతో విడిపోయి తల్లితో కలిసి ఉంటున్నాడు. కాగా గత రెండు రోజులుగా స్వరూప, శ్రీకాంత్‌లు కనిపించకపోవడంతో మంగళవారం ఇంటి యజమాని వారు ఉంటున్న పోర్షన్‌కు వెళ్లి కిటికీలోంచి చూడగా స్వరూప ఉరి వేసుకుని ఉండటం గమనించాడు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు పగలగొట్టారు. లోనికి వెళ్లి చూడగా మరొక రూములో శ్రీకాంత్ కూడా ఉరి వేసుకుని ఉండడం గమనించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. నిజాంబాద్ నుంచి వచ్చిన రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కృష్ణమల్ తెలిపారు.

పద్ధతి మారాల్సిందే..



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, కలెక్టర్ శశాంక తదితరులు

ప్రజా సమస్యలు ఏ మాత్రం పట్టవా..?

- తాగునీళ్లివ్వకుండా ఏం చేస్తున్నట్టు..
- నిలదీసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు
- సమస్యలు ఏకరువు పెట్టిన సభ్యులు
- 'నీళ్లు' నమిలిన సంబంధిత అధికారులు
- వాడీవేడిగా జెడ్పీ సర్వసభ్య సమావేశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'మిషన్ భగీరథ పథకంలో భాగంగా చేసిన ఖర్చుకు.. ప్రస్తుతం సరఫరా చేస్తున్న తాగునీటికి ఏమైనా పొంతన ఉందా? ఇప్పటికీ 50 గ్రామాలకు సరఫరా చేయకపోవడం ఏమిటి? పెరుగుతున్న పట్టణ విస్తీర్ణాన్ని, జనాభాను అంచనా వేయకుండా నీటి సరఫరాకు, పైపులైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఎలా తయారు చేస్తారు.. అధికారులు ఏం చేస్తున్నట్టు' అంటూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు నిలదీశారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఖైరతాబాద్‌లోని జెడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అధ్యక్షతన జరిగింది. కలెక్టర్ శశాంక, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ సీహెచ్ కృష్ణారెడ్డి, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్ ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు హాజరయ్యారు. మిషన్ భగీరథ సహా విద్య, వైద్య ఆరోగ్యశాఖల్లోని సమస్యలపై చర్చించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు తేడా లేకుండా సభ్యులంతా అధికారుల తీరుపై విరుచుకు పడ్డారు. మున్సిపాలిటీల్లోని శివారు ప్రాంతాలు, ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న గ్రామాలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులపై వాడీవేడిగా చర్చ సాగింది.

నీటి సరఫరాపై ఆగ్రహం

వేసవిలో నీటిఎద్దడి నివారణకు ఏం యాక్షన్ ప్లాన్ రూపొందించారో వివరించాలని మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రశ్నించారు. రూ.4.50 కోట్లతో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని గ్రామీణ మంచినీటి సరఫరా ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ ఆంజనేయులు వివరించారు. మిషన్‌భగీరథ పథకంలో ఇప్పటికే భారీగా ఖర్చు చేశారని, అయినా ఆశించిన స్థాయిలో నీరు సరఫరా కాకపోవడంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాగునీటి సరఫరా లేని గ్రామాలేమైనా ఉన్నాయా అని ప్రశ్నించగా, 59 వరకు ఉన్నట్లు అధికారులు చెప్పారు. దీంతో మంత్రి సహా ఎమ్మెల్యేలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ పథకం కింద చేసిన ఖర్చుకి.. ప్రస్తుత సరఫరాకు పొంతన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి, ఆ మేరకు అంచనాలు రూపొందించి, పక్కాగా పనులు పూర్తి చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. రూ.కోట్లు ఖర్చు చేసిన తర్వాత నీటి సమస్యలు మళ్లీ ఎలా ఉత్పన్నం అవుతాయంటూ ప్రశ్నల వర్షం కురిపించడంతో సమాధానం చెప్పలేక ఎస్ఈ సహా అధికారులు నీళ్లు నమలాల్సి వచ్చింది.

రోడ్డు కోసం నీటి సరఫరా ఆపేస్తారా?

అబ్దుల్లాపూర్‌మెట్ జీఎస్ఆర్ఎం కాలనీతో పాటు 15 రోజులుగా మంచినీరు సరఫరా కావడం లేదని జెడ్పీటీసీ దాసు సభ దృష్టికి తెచ్చారు. ఆ మార్గంలో రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయని, ఫలితంగా పైపులైన్లు దెబ్బతిని సరఫరాలో అంతరాయానికి కారణమైందని ఎస్ఈ చెప్పబోగా మళ్లీ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పైపులైన్లు మార్చిన తర్వాత పనులు చేసుకోవాలి కదా? అలా ఎలా అనుమతిచ్చారు అంటూ నిలదీశారు. విస్తరణ పేరుతో తాగునీటి సరఫరాను నిలిపివేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించాలని.. పనులు నిలిపివేయించి.. పైపులైను పునరుద్ధరించిన తర్వాతే రోడ్డు విస్తరణకు అనుమతివ్వాలని.. ఈ అంశంపై బుధవారం సాయంత్రంలోగా సమగ్ర నివేదిక అందజేయాల్సిందిగా కలెక్టర్ శశాంకను ఆదేశించారు. జీఎస్ఆర్ఎం సహా సమీపంలోని బాటసింగారం, పిగ్లీపూర్, కొత్తగూడ గ్రామాలకు మంచినీటి సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని సూచించారు.



సమావేశానికి హాజరైన సభ్యులు

భూ ఆక్రమణలపై ఉక్కుపాదం

'భూ ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతాం. ఇప్పటికే అధికారాన్ని అడ్డుపెట్టుకుని అడ్డదారుల్లో విలువైన ప్రభుత్వ భూములు కొట్టేసిన వారిని గుర్తించాం. వారి నుంచి ఆయా భూములను స్వాధీనం చేసుకుంటాం. ఇందు కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, రెవెన్యూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నాం' అని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. జిల్లాలో విలువైన భూములు అన్యాక్రాంతమైనట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. ఈ అంశంపై విజిలెన్స్ విచారణ కొనసాగుతోందని తెలిపారు. ఇందులో ఎవరి పాత్ర ఉన్నా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. దరిద్రపు ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తామని, భూమాత పేరుతో మరో పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు.

నీళ్లు రావడం లేదు



కొత్తూరు మున్సిపాలిటీకి ఇప్పటి వరకు మిషన్‌భగీరథ నీళ్లు రావడం లేదు. షాద్‌నగర్‌లోనూ సమస్య తీవ్రంగా ఉంది. అవసరమైన చోట కొత్తగా బోర్లు వేసేందుకు అనుమతివ్వాలి.

– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

పైపులైన్లు విస్తరించాలి



శివారు మున్సిపాలిటీల్లో సరిపడా నీరు రావడం లేదు.కొత్త కాలనీలకు లైన్లు లేకపోవడంతో భూగర్భ జలాలనే వాడుతున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని పైపులైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. పట్టణ విస్తీర్ణం, జనాభా ప్రాతిపదికన అంచనాలు రూపొందించాలి.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

అక్రమ వసూళ్లు



నిరుపేదలను ఇబ్బందులకు గురి చేయడం తగదు. పలువురు అధికారులు ప్రైవేటు భూములను ఉద్దేశపూర్వకంగానే పార్ట్–బిలో చేర్చి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ భూములను కాపాడాలి.

– వెంకటేశ్, జెడ్పీటీసీ, తలకొండపల్లి

క్రషర్లతో కలుషితం



మెండిగౌరెల్లి,యాచారంలో క్రషర్లు, మైనింగ్‌కు అనుమతులు ఇచ్చారు. క్రషర్‌మిషన్లతో ఆ ప్రాంతమంతా కలుషితమవుతోంది. మైనింగ్‌ను స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తక్షణమే వాటి అనుమతులు రద్దు చేయాలి. నిర్వాహకులపై కేసులు నమోదు చేయించాలి.

– కొప్పు సుకన్య, ఎంపీపీ, యాచారం

భూములు ఆక్రమిస్తున్నారు



కందుకూరు మండలం తిమ్మాపూర్ సర్వే నంబర్ 147లోని భూదాన్ భూములు ఆక్రమణకు గురయ్యాయి. పక్కనే ఉన్న పట్టాదారులు భూదాన్ భూములను తమ భూముల్లో కలిపేసుకుని అమ్ముతున్నారు. ప్రభుత్వ భూముల్లో లే అవుట్లకు అనుమతిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి.

– జ్యోతి, ఎంపీపీ, కందుకూరు

విముక్తి కల్పించాలి



ఫార్మాసిటీ భూ సేకరణ పేరుతో కడ్తాల్, కందుకూరు మండలాల పరిధిలోని పలు గ్రామాల్లోని భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. వాటిని ఇప్పటికీ ఫార్మాసిటీకి తీసుకోలేదు. అవసరానికి రైతులు అమ్ముకోలేక పోతున్నారు. వెంటనే ఆ భూములపై నిషేధాన్ని తొలగించాలి.

– దశరథ్‌నాయక్, జెడ్పీటీసీ, కడ్తాల్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు

- రూ.7లక్షల కోట్లకు రూ.20 వేల కోట్ల వడ్డీ కట్టాల్సి వస్తోంది..
- అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అమలు చేసి తీరుతాం
- మంత్రి శ్రీధర్‌బాబు

మొయినాబాద్ రూరల్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ధ్వజమెత్తారు. హిమాయత్‌నగర్ సమీపంలోని ఓ ప్రైవేటు కన్వెన్షన్‌లో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. కేసీఆర్ చేసిన ఏడు లక్షల కోట్ల అప్పులకు.. 20 వేల కోట్ల వడ్డీ కట్టాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అర్హులైన వారందరికీ ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రకటించారు. ఒకటి రెండు రోజుల్లో 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకు గ్యాస్ పథకాలకు శ్రీకారం చుట్టబోతున్నామని తెలిపారు. కాంగ్రెస్‌ను ఓడించడం చేతకాక బీజేపీతో పొత్తు అంటూ బీఆర్ఎస్ డ్రామాలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే ఓర్వలేక ఆటో డ్రైవర్లతో సమ్మె చేయిస్తున్నారని దుయ్యబట్టారు. ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల్లో 17 స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తంచేశారు.

హామీలకే పరిమితం..

తొమ్మిదిన్నరేళ్ల కాలంలో బీఆర్ఎస్ సాధించింది ఏమీ లేదని, హామీలకే పరిమితమైందని వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. తండాలు, చిన్న గ్రామాలను జీపీలుగా ఏర్పాటు చేసి గాలికి వదిలేశారని తెలిపారు. చేసిన పనులకు బిల్లులు రాక సర్పంచ్‌లు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని స్పష్టంచేశారు. ప్రొటోకాల్ పాటించకపోవడాన్ని భరించలేకే తాను కాంగ్రెస్‌లో చేరానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీమ్‌భరత్, పీసీసీ కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్, జిల్లా మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు మహేందర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఇబ్రహీంపట్నంరూరల్: పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ ఉద్యోగుల వేతనాలు తక్షణమే చెల్లించాలని తెలంగాణ అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని గత ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ కూడా అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. తక్షణమే సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. మేలో వేసవి సెలవులు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం నెలకు రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి కవిత, అధ్యక్షురాలు రాజలక్ష్మి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మయ్య, జిల్లా కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి లక్ష్మి, ఉపాధ్యక్షురాలు నాగమణి పాల్గొన్నారు.

పరిశ్రమల్లో మగ్గి.. జీవితాలు బుగ్గి!

- తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- గాలిలో దీపంలా కార్మికుల బతుకులు
- నిర్లక్ష్యం వీడని యాజమాన్యాలు
- కరువైన కనీస రక్షణ చర్యలు
- పట్టించుకోని అధికారులు



పరిశ్రమలో మంటల్లో కాలిపోయిన బట్టీ

కొందుర్గు: కార్మికుల జీవితాలు పరిశ్రమల్లో మగ్గి(బుగ్గి) పోతున్నాయి. యాజమాన్యాల నిర్లక్ష్యం.. అధికారుల ఉదాసీన వైఖరి వెరసి ప్రాణాల మీదికి తెస్తోంది. తాజాగా కొందుర్గులోని స్కాన్ ఎనర్జీ పరిశ్రమలో జరిగిన ప్రమాదం మరోసారి నిర్వాహకుల అలసత్వాన్ని తేటతెల్లం చేస్తోంది. వరుస ప్రమాదాలు జరుగుతున్నా ఇటు పరిశ్రమ నిర్వాహకులు గానీ, అటు అధికారులు గానీ పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఈ పరిశ్రమలో పాత ఇనుమును కరగదీసి కొత్తగా ఇనుప రాడ్లు తయారు చేస్తారు. ఈ ప్రక్రియలో దాదాపు 1300 డిగ్రీలపైన ఉష్ణోగ్రతతో వేడిచేసి పాత ఇనుప సామగ్రిని మరిగిస్తారు. పాత ఇనుప సామగ్రి సేకరణలో చిన్నచిన్న గ్యాస్ సిలిండర్లు, పేలే సామగ్రి ఉండటంతో పొరపాటున అవి బట్టీల్లో మరిగించడం ద్వారా పేలడానికి ఎక్కువగా అవకాశాలు ఉంటాయని భావిస్తున్నారు. ఈ పేలే సామగ్రిని వేరుచేయడానికి పాత ఇనుప సామగ్రి శుద్ధి యంత్రం ఉంటుంది. ఈ యంత్రాన్ని పరిశ్రమ నిర్వాహకులు వినియోగించకపోవడం, పేలుడుకు సంబంధించిన సామగ్రి వేరుచేసే ప్రక్రియలో పరిశ్రమ పర్యవేక్షక సిబ్బంది నిర్లక్ష్యంతోనే తరచూ పేలుళ్లు జరుగుతున్నాయని అంటున్నారు.

ఆరు నెలల్లో రెండుసార్లు..

కొందుర్గు స్కాన్ ఎనర్జీ పరిశ్రమలో గడిచిన ఆరు నెలల్లో రెండుసార్లు బట్టీలు పేలాయి. 2023 సెప్టెంబర్ 5న ఇదే పరిశ్రమలో బట్టీ పేలి అందులో పనిచేస్తున్న ఎనిమిది మంది కార్మికులు గాయాలపాలయ్యారు. తాజాగా సోమవారం బట్టీపేలి మరికొంతమంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ పరిశ్రమలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా.. కార్మికులు మృతిచెందినా నిర్వాహకులు బయటికి పొక్కకుండా జాగ్రత్తపడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి.

కార్మికులంతా ఇతర రాష్ట్రాల వారే..

ఈ పరిశ్రమలో పనిచేసే కార్మికులంతా బీహార్, ఒడిశా, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు సంబంధించిన వారే. ప్రమాదాలు జరిగినా.. కార్మికులు మృతిచెందినా బయటికి పొక్కకుండా ఉంటుందని, గుట్టుచప్పుడుకాకుండా రాజీ కుదుర్చుకోవడానికి అవకాశం ఉంటుందని ఇతర రాష్ట్రాల కార్మికులను నియమించుకుంటారని పలువురు అభిప్రాయపడుతున్నారు.


కార్మికులకు లేని రక్షణ కవచాలు..

పరిశ్రమలో పనిచేసే కార్మికులకు కచ్చితంగా రక్షణ కవచాలు అవసరం. కొందుర్గు శివారులోని స్కాన్ ఐరన్ పరిశ్రమలో దాదాపు 500 పైగా కార్మికులు పనిచేస్తున్నారు. ఇనుమును కరగదీసి రాడ్లు తయారు చేసే ఈ పరిశ్రమలో పనిచేసే వారికి కచ్చితంగా నెత్తికి హెల్మెట్, మోకాళ్ల వరకు బూట్లు, కళ్లకు అద్దాలు, చేతులకు గ్లౌస్‌లు ఉండాలి. కానీ ఈ పరిశ్రమలో ఇలాంటి నిబంధనలేవీ లేవని తెలుస్తోంది. దీంతో చిన్నపాటి ప్రమాదం జరిగినా కార్మికుల ప్రాణాల మీదికి తెస్తోంది. కార్మికులతో ఎనిమిది గంటలే పనిచేయించుకోవాలన్న నిబంధనలు ఉన్నప్పటికీ ఇక్కడ 12 గంటల వరకు పని చేయించుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఒకరి ఆరోగ్యం విషమం

సోమవారం జరిగిన ప్రమాదంలో అనిల్ పాశ్వాన్, కమల్ కిశోర్ అనే కార్మికులు గాయపడ్డారని.. వీరిలో కమల్ కిశోర్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. 80 శాతం వరకు కాలిన గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని డీఆర్‌డీఓ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. కమల్ కిశోర్ వాంగ్మూలం జడ్జి ఎదుట రికార్డు చేసినట్లు పేర్కొన్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి..



అధికారులు పనిచేసేది కార్మికుల సంక్షేమం కోసమా..పరిశ్రమ యాజమాన్యాన్ని రక్షించడం కోసమా? కొందుర్గు స్కాన్ ఎనర్జీ పరిశ్రమలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. అధికారులు వెంటనే స్పందించాలి. లేదంటే ఆందోళనకు దిగుతాం.

–బుద్దుల జంగయ్య,సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు

చేవెళ్ల స్థానాన్ని మోదీకి గిఫ్ట్‌గా ఇవ్వాలి

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్
- వికారాబాద్‌కు చేరుకున్న విజయ సంకల్ప యాత్ర

వికారాబాద్ అర్బన్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల లోక్‌సభ స్థానాన్ని గెలిపించి ప్రధాని మోదీకి బహుమతిగా ఇవ్వాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పిలుపునిచ్చారు. బీజేపీ విజయ సంకల్ప యాత్ర మంగళవారం రాత్రి వికారాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని బీజేఆర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 80శాతం ఉన్న హిందువుల కోసం పనిచేస్తున్న బీజేపీని కేంద్రంలో మూడోసారి అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలో పది లక్షల మంది యువతకు ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి లక్షల కోట్ల నిధులు ఇస్తే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ తన ఫొటోలతో ప్రచారం చేసుకున్నారని ఆరోపించారు. నేడు పేదలకు ఇస్తున్న రేషన్ బియ్యం, గ్రా మాల్లో నిర్మించిన మరుగుదొడ్లు, శ్మశానవాటికలు, క్రీడా ప్రాంగణాలన్నీ కేంద్ర నిధులతో నిర్మించినవేనని పేర్కొన్నారు. కేసీఆర్ వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి ఉంటే ఈ పాటికి కేసీఆర్, కేటీఆర్‌ను అరెస్టు చేయడం తోపాటు, ఆయన ఫామ్ హౌస్‌ను బుల్డోజర్లతో కూలగొట్టే వాళ్లమన్నారు. తెలంగాణలో బీజేపీ ఎంపీ స్థానాలు అధికంగా గెలిస్తే పెద్ద ఎత్తున నిధులు రావడంతో రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే చెల్లని ఓటుగా మారుతుందని అన్నారు.

ఆలయ భూములు ఆక్రమిస్తే చర్యలు

- దేవాలయ భూముల పరిరక్షణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత
- ఆలయ భూములకు సర్వే చేసి హద్దురాళ్ల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..


ఆలయ భూమిలో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కడ్తాల్: ఆలయ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని దేవాలయ భూముల పరిరక్షణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత హెచ్చరించారు. మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయానికి 40 ఎకరాలకు పైగా భూమి ఉంది. ఈ భూమి పలుచోట్ల ఆక్రమణలకు గురైంది. మూడేళ్లుగా పలుమార్లు సర్వే చేసినా అధికారులు సర్వేల్లో వ్యత్యాసం వస్తోంది. సమీప పొలాల యజమానులు అభ్యంతరంతో సర్వే తరచూ వాయిదా పడుతోంది. దీంతో విలువైన ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. ఈ నెల 2న 'సాక్షి' దినపత్రికలో 'ఆయల భూములకు రక్షణేది' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం దేవాలయ భూముల పరిరక్షణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత, తహసీల్దార్లు హరిత, విజయలక్ష్మి, ఈఓలు మోహన్‌రావు, స్నేహలత ఆలయ అభివృద్ధి కమిటీ, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో సర్వే నెంబర్ 120, 125, 130లలో అన్యాక్రాంతమైన ఆలయ భూములకు సర్వే నిర్వహించారు. సర్వే నెంబర్ 125, 130లలో హద్దులు నిర్ధారించారు. ఆక్రమణలు తొలగించి, ఆలయ భూమికి సంబంధించిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సర్వే నెంబర్ 120లో మరో రెండు రోజుల్లో సర్వే పూర్తి చేసి హద్దులు నిర్ధారిస్తామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా దేవాలయ భూముల పరిరక్షణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత మాట్లాడుతూ.. ఆలయ భూమిలో ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న రోడ్డును జేసీబీతో తొలగించామన్నారు. మూడు చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. హద్దులను, బోర్డులను ఎవరైనా తొలగిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆంజనేయులు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు మల్లేశ్‌గౌడ్, శాయిరెడ్డి, రాఘవేందర్, ఎగిరిశెట్టి బాబు, బీక్యానాయక్, దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ అరెస్ట్

వివరాలు వెల్లడించని పోలీసులు

నందిగామ: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ నాగరకుంట నవీన్‌రెడ్డిని మంగళవారం నందిగామ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కుటుంబసభ్యులు, సన్నిహితులు తెలిపిన ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున కొంత మంది పోలీసులు వచ్చి నవీన్‌రెడ్డిని తీసుకెళ్లారు. కాగా ఏ కేసు విషయంలో, ఎందుకు, ఎక్కడికి తీసుకెళ్తున్నారో తమకు చెప్పలేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. 2017లో ఉమ్మడి మామిడిపల్లిలో ఓ భూమి కేసులో నవీన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై స్థానిక పోలీసులను సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. కాగా నవీన్‌రెడ్డిని శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించి అక్కడి నుంచి షాద్‌నగర్‌లోని సీహెచ్‌సీలో వైద్యపరీక్షలు నిర్వహించి అనంతరం షాద్‌నగర్‌లోని న్యాయస్థానంలో హాజరు పర్చేందుకు పోలీసులు తీసుకెళ్లారు. ఈ విషయమై నవీన్‌రెడ్డి షాద్‌నగర్‌లో సీహెచ్‌సీలో వైద్యపరీక్షల సందర్భంలో మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయంగా కక్షసాధింపులో భాగంగా ఇదంతా జరుగుతోందంటూ ఆరోపించారు. కాగా ఇప్పటి వరకు పోలీసులు ఎలాంటి సమాచారం వెల్లడించకపోవడం గమనార్హం.

నేటి నుంచి గోల్ఫ్ టోర్నమెంట్

- వికారాబాద్‌లోని ఊటీ మాస్టర్స్‌లో పోటీలు
- విజేతకు రూ.కోటి బహుమానం

మణికొండ: భారత గోల్ఫ్ రంగంలో ప్రఖ్యాతి గాంచిన ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా(పీజీటీఐ) భాగస్వామ్యంతో వికారాబాద్‌లోని ఊటీ మాస్టర్స్ గోల్ఫ్ గ్రౌండ్‌లో నేటి నుంచి శనివారం వరకు టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని డ్రీమ్ వ్యాలీ గ్రూప్ సీఎండీ కె.సంతోశ్‌రెడ్డి, పీజీటీఐ సీఈఓ ఉత్తమ్‌సింగ్ తెలిపారు. మంగళవారం నార్సింగిలోని డ్రీమ్ వ్యాలీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టోర్నమెంట్ విశేషాలను వారు వివరించారు. హైదరాబాద్ కేంద్రంగా రెండోసారి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అయితే, గోల్ఫ్ క్రీడకు మన రాష్ట్రంలో అంతగా ప్రోత్సాహం లేదని, రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తే క్రీడాకారులు పెరిగే అవకాశం ఉందన్నారు. టోర్నమెంట్‌లో మొత్తంగా 126 మంది క్రీడాకారులు పాల్గొనుండగా రాష్ట్రానికి చెందిన వారు ఆరుగురు ఉన్నారని తెలిపారు. విజేతకు రూ.కోటి పురస్కారం ఉంటుందన్నారు. అనంతరం పూర్వ చాంపియన్లు మను గండాస్, అమన్‌రాజ్‌తో కలిసి టోర్నమెంట్ మెమెంటో ఆవిష్కరించారు.

రాజేంద్రనగర్ ఆర్డీఓ బాధ్యతల స్వీకరణ

అత్తాపూర్: రాజేంద్రనగర్ ఆర్డీఓగా కొప్పుల వెంకట్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఆర్డీఓ మల్లయ్య బదిలీపై వెళ్లడంతో అర్బన్ ల్యాండ్ స్పెషల్ సీలింగ్ కలెక్టర్‌గా, రంగారెడ్డి జిల్లా ఎస్‌డీసీ బ్రాకెట్ యూఎస్‌సీ రంగారెడ్డి జిల్లాలో విధులు నిర్వహించిన వెంకట్‌రెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీనిచ్చారు.

వేధిస్తే షీటీంకు కాల్ చేయండి

- వివరాలు గోప్యంగా ఉంచుతాం
- రాచకొండ డిప్యూటీ కమిషనర్ ఉషావిశ్వనాథ్


మాట్లాడుతున్న ఉషావిశ్వనాథ్

ఇబ్రహీంపట్నం: ప్రేమ పేరిట అబ్బాయిలు అమ్మాయిలను వేధిస్తున్నారని.. ప్రేమించకుంటే దారుణాలకు ఒడిగడుతున్నారని రాచకొండ డిప్యూటీ కమిషనర్ టి.ఉషావిశ్వనాథ్ అన్నారు. మహిళలు, విద్యార్థినులు, ఆడ పిల్లలపై జరుగుతున్న దారుణాలపై రాచకొండ పోలీస్ కమిషనరేట్ మహిళా భద్రత విభాగం, నేషనల్ సర్వీస్ స్కీం ఆధ్వర్యంలో మంగళవారం గురునానక్ విద్యాసంస్థలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అమ్మాయిల ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ అల్లరి పాలు చేయడం పరిపాటయిందన్నారు. అమ్మాయిలు తల్లిదండ్రులకు చెప్పుకోలేని దుస్థితి నెలకొందన్నారు. తల్లిదండ్రులకు సమస్య వివరిస్తే సరైన నిర్ణయాలు తీసుకోవచ్చని సూచించారు. ప్రేమ విషయంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అపాయంలో ఉన్నప్పుడు షీటీంకు సమాచారం ఇవ్వాలని.. వారి వివరాలను గోప్యంగా ఉంచి తగిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. తల్లిదండ్రులు పిల్లల సమస్యలు, పరిస్థితులను అర్థం చేసుకుని పోలీసుల సహకారం తీసుకోవాలని సూచించారు. అనంతరం రాచకొండ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి.వెంకటేశం మాట్లాడుతూ.. మహిళలపై నేరాలను తగ్గించేందుకు దిశగా మహిళా పోలీస్ విభాగం, షీ టీంలు ఎంతో సహకరిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గురునానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ గగన్‌దీప్‌సింగ్ కోహ్లి, ఎండీ హెచ్‌ఎస్ సైనీ, డైరెక్టర్ వెంకటరావు, ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌రెడ్డి, జాయింట్ డైరెక్టర్ పార్థసారథి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే మహిళల ఆర్థికాభివృద్ధి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట: మహిళల ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని సంగెం, ఎక్లాస్‌ఖాన్‌పేట, కొత్తపేట, సంతాపూర్, తులవానిగడ్డలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలులోకి తీసుకువస్తోందన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు సిరిపురం యాదయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కొత్తపేట గ్రామంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాససాగర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను సన్మానించారు. లేమామిడి గ్రామంలో రోడ్డు సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, తహసీల్దార్ అజీంఅలీ, ఎంపీటీసీ సభ్యులు సురేశ్‌రెడ్డి, రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశ్, శ్రీధర్‌రెడ్డి, అబ్బి సుందరయ్య, గిరియాదవ్, కర్ణాకర్‌రెడ్డి, రూప్లానాయక్, భిక్షపతి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాప్‌పై పోలీసుల దాడి

మద్యం సీజ్


పోలీసులు సీజ్ చేసిన మద్యం బాటిళ్లు

శంకర్‌పల్లి: బెల్ట్ షాపుపై శంకర్‌పల్లి పోలీసులు దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. డిటెక్టివ్ సీఐ నాగరాజు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని సంకేపల్లి గ్రామానికి చెందిన తోకల కృష్ణ కిరాణ దుకాణంలో మద్యం అమ్ముతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో కిరాణాదుకాణంపై దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సీజ్ చేసిన మద్యంబాటిళ్ల విలువ రూ.13,500 ఉంటుందని చెప్పారు. కేసు దర్యాప్తులో ఉంది.

యాదయ్య మరణం వెలకట్టలేనిది

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి


సిరిపురం యాదయ్య విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

మహేశ్వరం: మలిదశ ఉద్యమ అమరుడు సిరిపురం యాదయ్య మరణం వెలకట్టలేనిదని.. ఆయన ఆశయ సాధనకు కృషిచేస్తామని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. సిరిపురం యాదయ్య 14వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆమె మహేశ్వరం గేటు కమాన్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 21 ఏళ్లకే తెలంగాణ సాకారం కోసం ఉస్మానియా వర్సిటీలో ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మబలిదానం చేసుకోని యాదయ్య ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. యాదయ్య మండల పరిధిలోని నాగారం గ్రామానికి చెందిన వారవ్వడం తమకు గర్వకారణమన్నారు. అమరుల త్యాగాన్ని గుర్తించిన మాజీ సీఎం కేసీఆర్ ఇంటికో ఉద్యోగం, కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హన్మగళ్ల ద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ర్కెట్ కమిటీ వైస్ చైర్మన్ స్వర్ణగంటి ఆనందం, కౌన్సిలర్లు రెడ్డిగళ్ల సుమన్, రవి నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు అంబయ్య యాదవ్, సుధాకర్‌రెడ్డి, జెల్లెల లక్ష్మయ్య యాదవ్, రాఘవేందర్ రెడ్డి, దయ్యాల శ్రీనివాస్, చంద్రయ్య, ఆదిల్, ప్రభాకర్, రామకృష్ణ, శ్రీకాంత్ గౌడ్, రాజు, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు ఇళ్లలో చోరీ

నగదు, బంగారం, వెండి ఎత్తుకెళ్లిన దొంగలు


చోరీకి గురైన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

కడ్తాల్: మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాలో సోమవారం రాత్రి తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని గుర్తు తెలియని వ్యక్తులు ఐదు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. తండాకు చెందిన కేతావత్ బిక్కు, సభవట్ రమేశ్, సభవట్ లాలు, కిషన్, నేనావత్ దేవేందర్‌లు ఇటీవల కుటుంబ సభ్యులతో కలిసి ఉపాధి కోసం కూలీకి హైదారాబాద్ వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు సోమవారం అర్ధరాత్రి ఆయా ఇంటి తాళాలను పగుల గొట్టి నగదు, బంగారం, వెండి ఆభరణాలను అపహరించారు. మరుసటి రోజు ఉదయం స్థానికులు గమనించి బాధితులకు, పోలీసులకు సమాచారం అందించారు. సభవట్ రమేశ్ ఇంట్లో మూడు తులాల బంగారు పుస్తెల తాడు, 40 తులాల వెండి చోరీకి గురైయింది. కేతావత్ బిక్కు, సభవట్ లాలు, కిషన్, నేనావత్ దేవేందర్‌ల ఇళ్లలో కూడా దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆయా ఇళ్లలో నగదు చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ శివప్రసాద్, ఎస్‌ఐ వరప్రసాద్ తండా చేరుకుని గ్రామస్తులను, బాధితులను అడిగి వివరాలు సేకరించారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి


రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్: మహిళల ఆరోగ్య సంరక్షణకు వైద్యారోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ... ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే మహిళలకు అవసరమైన అన్ని రకాల పరీక్షలు నిర్వహించాలని అన్నారు. రక్త నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం కొండాపూర్‌లో ఉన్న ఆస్పత్రికి పంపించాలని సూచించారు. విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన చికిత్సలు అందించాలన్నారు. మహిళా ఆరోగ్య శిబిరంలో 62 మందికి పరీక్షలు నిర్వహించినట్లు, అందులో 16 మంది రక్తనమూనాలను పరీక్షల నిమిత్తం పంపినట్లు తెలిపారు. ప్రతి మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్ వైజర్ రమ, ఫార్మాసిస్టు ఉదయ్‌కుమార్, నర్సు సువర్ణ, ల్యాబ్ టెక్నీషియన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మేకల మందపై కుక్కల దాడి

పది జీవాలు మృతి


మేకల కళేబరాలు

మొయినాబాద్: మేకల మందపై కుక్కలు దాడి చేసి పది జీవాలను చంపేశాయి. ఈ సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన అజ్మత్ తనకున్న అర ఎకరంలో మేకల ఫాం ఏర్పాటు చేసుకున్నాడు. బక్రీద్ కోసం మేకలను తెచ్చి పెంచుతున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం రాత్రి మేకలను ఫాంలో ఉంచి అజ్మత్ ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో మేకల ఫాంకు చుట్టూ ఏర్పాటు చేసిన ఇనుప జాలి కింది నుంచి కుక్కలు లోపలికి దూరి మేకలపై దాడి చేశాయి. దీంతో పది మేకలు మృతి చెందగా మరో ఐదు గాయపడ్డాయి. విషయం తెలుసుకున్న మండల పశువైద్యాధికారి హైమద్ ఘటనా స్థలాన్ని సందర్శించి మేకల కళేబరాలను పరిశీలించారు. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు జయకేతనం


ట్రోఫీ అందుకుంటున్న జిల్లా బాలికల జట్టు

హుడాకాంప్లెక్స్: అంతర్‌జిల్లా సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో జిల్లా బాలికల జట్టు విజయకేతనం ఎగురవేసింది. సూర్యాపేట జిల్లా చింతలపాలెంలో సోమవారం నిర్వహించిన 33వ సబ్ జూనియర్ కబడ్డీ పోటీలలో రంగారెడ్డి బాలికల జట్టు భద్రాద్రి కొత్తగూడెం జట్టుపై (48–18) విజయం సాధించి చాంపియన్‌గా నిలిచారు. విజయం సాధించిన జట్టును మంగళవారం కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్, సంయుక్త కార్యదర్శి రవికుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి చంద్రమోహన్ తదితరులు అభినందించారు.

టైర్ పేలి వాహనం బోల్తా


వాహనం బోల్తాపడి పడిపోయిన పుచ్చకాయలు

కందుకూరు: పుచ్చకాయలతో వెళ్తున్న బొలెరో వాహనం టైర్ పేలి బోల్తాపడింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. సాయంత్రం కడ్తాల్ వైపు నుంచి హైదరాబాద్ మార్కెట్‌కు బొలెరో పుచ్చకాయల లోడుతో వెళ్తుంది. కాగా మార్గమధ్యలో మండల కేంద్రం శ్రీశైలం రహదారిపై విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఆ వాహనం వెనక టైర్ పేలింది. దీంతో ఆ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. వాహనంలోని పుచ్చకాయలు రోడ్డుపాలయ్యాయి. వాహనంలోని డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డారు.

కాంగ్రెస్‌లోకి జలమండలి ఉద్యోగులు

మణికొండ: హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ సెక్షన్ల జలమండలి ఉద్యోగులు రాష్ట్ర జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు చవ్వ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో మంగళవారం చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి న్యాయం చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, బీఆర్‌ఎస్‌లో అందరూ నష్టపోయారని, వారి హక్కుల ప్రకారం దక్కాల్సిన సౌకర్యాలు, వేతనాలు సైతం అందలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉండడం ప్రజా, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుండడంతో స్వచ్ఛందంగా పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు.

భవనం పైనుంచి పడి వలస కూలీ మృతి


అగేశ్ పటేల్ మృతదేహం

మొయినాబాద్: నిర్మాణంలో ఉన్న భవనం రెండో అంతస్తు నుంచి కిందపడి ఓ వలస కూలీ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని కనకమామిడి రెవెన్యూలో మంగళవారం చోటుచేసుకుంది. మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కనకమామిడి రెవెన్యూలో నగరానికి చెందిన ఓ బడా వ్యాపారి నిర్మిస్తున్న రిసార్ట్ నిర్మాణ పనులను హరీశ్ కాంట్రాక్టు తీసుకున్నాడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన అగేశ్‌పటేల్(20)ను కాంట్రాక్టర్ కూలికి తీసుకువచ్చాడు. మరో వందమందికి పైగా కూలీలు నిర్మాణ పనులు చేపడుతున్నారు. మంగళవారం అగేశ్‌పటేల్ భవనంలోని రెండో అంతస్తులో ట్రాలీలో కంకర తీసుకువెళ్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ట్రాలీ కూలీపై పడడంతో గాయపడ్డాడు. అక్కడున్న వారు క్షతగాత్రుడిని వెంటనే స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రిలోనే మృతదేహం

భవనం పైనుంచి పడి మృతి చెందిన వలస కూలి అగేశ్‌పటేల్ మృతదేహం మంగళవారం సాయంత్రం వరకు ఆస్పత్రిలోనే ఉంది. ఉదయం 10 గంటల సమయంలో ఘటన జరగడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. వైద్యులు మృతి చెందాడని చెప్పినా రిసార్ట్ యజమాని అక్కడికి రాలేదు. కాంట్రాక్టర్ సైతం తనకేమి తెలియనట్లుగా వ్యవహరించాడు. బంధువులకు సమాచారం ఇవ్వడంతో మృతుడి బావ వచ్చి పోలీసులకు ఫిర్యాదు ఇచ్చేంత వరకు మృతదేహాన్ని ఆస్పత్రిలోనే ఉంచారు. బతుకుదెరువుకోసం వలస వచ్చిన యువకుడు మృతి చెందినా రిసార్ట్ యజమాని, కాంట్రాక్టర్ కనీసం మానవత్వం చూపకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అక్రమ నిర్మాణాల్లో వరుస మరణాలు

మొయినాబాద్ మండలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల్లో వరుసగా కూలీల మరణాలు కలకలం రేపుతున్నాయి. మూడు నెలల క్రితం కనకమామిడి, సురంగల్ రెవెన్యూల్లో నిర్మిస్తున్న ఫైర్‌ఫ్యాక్స్ రిసార్ట్స్‌లో నిర్మాణంలో ఉన్న భవనం కూలి పశ్చిమబెంగాల్, బిహార్‌కు చెందిన ఇద్దరు వలస కూలీలు మృతి చెందారు. తాజాగా కనకమామిడి రెవెన్యూలో నిర్మిస్తున్న రిసార్ట్‌లో భవనం పైనుంచి పడి ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వలస కూలీ మృతి చెందాడు. అయితే ఈ ప్రాంతంలో జరిగే నిర్మాణాలన్నీ అక్రమ నిర్మాణాలే కావడం విశేషం. ఈ ప్రాంతం 111 జీఓ పరిధిలో ఉండటంతో ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టేందుకు వీలులేదు. ఈ అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు కళ్లుమూసుకోవడంతో జరుగుతున్న అక్రమనిర్మాణాల్లో అమాయక కూలీల ప్రాణాలు బలవుతున్నాయి.